క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ


లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ రామచంద్ర

లింగసముద్రం: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ రామచంద్ర సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు పరిశీలించి సమస్యాత్మక గ్రామాలు ఎన్ని ఉన్నాయి, పెండింగ్ కేసుల గురించి ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు గ్యాంబ్లింగ్, గంజాయి వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపలాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బందికి కేసుల గురించి సూచనలు చేశారు. కార్యక్రమంలో గుడ్లూరు సీఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈద్గా అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం


నగదు అందజేస్తున్న కదిరి బాబూరావు

సీఎస్‌పురం(పీసీపల్లి): కనిగిరి పట్టణంలోని ఈద్గా అభివృద్ధి కోసం వైఎస్సార్ సీపీ కావలి నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు రూ.2 లక్షల విరాళం అందజేశారు. మంగళవారం శీలంవారిపల్లి లోని క్యాంపు కార్యాలయంలో కనిగిరికి చెందిన ముస్లిం పెద్దలకు నగదు అందజేశారు. వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ బుజ్జి, కనిగిరి మాజీ కౌన్సిలర్లు షేక్ ఫయాజ్, షేక్ అహమ్మద్, కదిరి రమణయ్య, షేక్ షిలార్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

కనిగిరి రూరల్: పట్టణంలోని గార్లపేట రోడ్డులో ఉన్న ఖాళీ స్థలంలో వివిధ గ్రామాల ప్రజలకు ఉపయోగ పడేలా బస్‌షెల్టర్ ఏర్పాటుకు స్థల కేటాయింపు చేయాలని సర్పంచ్‌లు కమిషనర్ డీవీఎస్ నారాయణరావుకు వినతి పత్రం అందచేశారు. సర్పంచ్‌లు నాగేంద్రారెడ్డి, అంకిరెడ్డి, గ్రామాల నాయకులు మాట్లాడుతూ పునుగోడు, బొమ్మిరెడ్డిపల్లి, తాళ్లూరు, గుడిపాడు, మర్రిపూడి మండలంలోని గార్లపేట పంచాయతీలకు చెందిన ప్రజలు నిత్యం గార్లపేట బస్టాండ్‌లో ఉండి బస్సు, లేదా ఇతర వాహనాలో వెళ్తుంటారని తెలిపారు. అలాంటి ప్రదేశంలో ప్రవేటు వ్యక్తులు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, టి.మల్లికార్జున, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

1382 బేళ్లు కొనుగోలు

కందుకూరు: పొగాకు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మంగళవారం కందుకూరు ఒకటవ పొగాకు వేలం కేంద్రంలో 824 బేళ్లు విక్రయానికి ఉంచగా 765 బేళ్లు అమ్ముడుపోయాయి. అలాగే రెండో వేలం కేంద్రంలో 701 బేళ్లను ఉంచగా 617 బేళ్లు విక్రయించారు. రెండు వేలం కేంద్రాల్లోను కేజీ పొగాకు గరిష్ట ధర రూ.200 లభించగా, కనిష్ట ధరలు వరుసగా రూ.160, రూ.176 వచ్చాయి. సరాసరి ధరలు రూ.198 వరకు నమోదయ్యాయి.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరి రూరల్: జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మినీ జాబ్‌మేళా కార్యక్రమం జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి టి. భరద్వాజ్ అధ్యక్షతన నిర్వహించారు. జాబ్ మేళాకు 109 మంది హాజరు కాగా 29 మంది ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జె. ఉషారాణి, ప్లేస్‌మెంట్ అధికారి బాషా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ బాలకృష్ణా, కో ఆర్డినేటర్ భాస్కర్, ఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేయొద్దు

- రోగులకు మెరుగైన సేవలందించి వైద్యశాలలకు వన్నె తేవాలి
- ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

కందుకూరు అర్బన్: ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేయకుండా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన సేవలందించి వైద్యశాలకు వన్నె తీసుకురావాలని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం సూపరింటెండెంట్ డాక్టర్ శకంతుల అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. వైద్యశాల అభివృద్ధికి అవసరమైన అజెండాలో పొందుపరిచిన అంశాలను ఎమ్మెల్యే చదివి వినిపించారు. వైద్యశాలకు ఒక సీలింగ్ ఫ్యాను కొనుగోలు చేసేందుకు రూ.3,800 ఖర్చును, ఆక్సిజన్ ప్లాంట్ జనరేటర్ సర్వీసింగ్‌కు రూ.27,914 ఖర్చు చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యాధికారులు ఇష్టం వచ్చినట్లు ఫ్యాను కొనుగోలు చేయడం చెల్లదని, ఏ కంపెనీ కొనుగోలు చేసింది చెప్పాలన్నారు. ఫ్యాను ధర ఉండదని ఈ రకంగా ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆక్సిజన్ జనరేటర్‌కు కంపెనీ సర్వీస్ ఉండగా దానికి అదనంగా రూ.27914 ఖర్చుపెట్టాల్సిన అవసరం ఏంటని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యశాల ఆరోగ్యమిత్ర నేను చెప్పిన డివైజర్‌నే కొనుగోలు చేయాలని చెప్పడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. బయోమెట్రిక్‌కు అవసరమయ్యే డివైజర్‌ను కొనుగోలు చేస్తాం తప్ప మీకు ఇష్టం వచ్చిన డివైజర్‌ను కొనాల్సిన అవసరం లేదని మండిపడ్డారు. వైద్యశాలకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు ఒకటికి రెండుసార్లు ధరలు తెలుసుకుని కొనుగోలు చేయాలన్నారు. వైద్యశాలలోకి దోమలు రాకుండా కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్యశాల పక్కన నిర్మాణం జరుగుతున్న అదనపు గదుల భవనానికి క్యూరింగ్ సరిగా జరగడం లేదని దానిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. రోగులతో స్నేహభావంతో మెలిగి నాణ్యమైన సేవలు అందించాలన్నారు. బాధ్యతా రహితంగా పనిచేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం


ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న వరికూటి అశోక్ బాబు

- కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- చిలంకూరులో కొనసాగుతున్న గడపగడపకు మన ప్రభుత్వం

మర్రిపూడి: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడం జరుగుతుందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. చిలంకూరులో రెండో రోజైన మంగళవారం కూడా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రేషన్ కార్డులు వారీగా లబ్ధి దారులకు అందజేసిన సంక్షేమ వివరాలతో కూడిన బ్రోచర్‌లను అందజేశారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు రైతు భరోసా కింద రూ. 13,500 ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అలాగే డ్వాక్రా మహిళలకు మూడు విడతలుగా రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజలకు మరిన్ని సేవలను అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యి నాలుగు సంవత్సరాల కాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాయన్నారు. రైతులకు గిట్టుబాటు ధరకల్పించడంతో రైతు మోముల్లో ఆనందం వెల్లువిరిసిందని.. తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి ని చేసుకోవాలన్నారు. బీవీ భాస్కర్ రెడ్డి, మొల్లల శివరామిరెడ్డి, కోటా నర్సింహారావు, క్రిష్టపాటి సుబ్బారెడ్డి, ఎం. చంద్రమౌళి, కె. వెంకట్రావు, వీరేళ్ల శ్రీనివాసులు, వి. మల్లికార్జునరెడ్డి, తాళ్ల వెంకటరెడ్డి, ఏ. వెంకటరెడ్డి, ఎస్‌కే శిలార్ అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం


టంగుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు


సింగరాయకొండ: ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యారోగ్య సిబ్బంది


హెచ్‌ఎంపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

టంగుటూరు: ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. టంగుటూరులో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా దోమల వ్యాధులపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ మంగళవారం నిర్వహించారు. సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని ప్రతీ గ్రామంలో చెత్త, ఇంటి చుట్టూ ప్లాస్టిక్ కప్పులు, టెంకాయ చిప్పలు, టైర్లు ఉంచరాదన్నారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, వర్షపు నీరు నిల్వకుండా చూసుకోవాలని, తద్వారా దోమల అభివృద్ధి అరికట్టవచ్చన్నారు. కామేశ్వరరావు, అనురాధ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సింగరాయకొండ: దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటమే ప్రధాన మార్గమని ప్రభుత్వ వైద్యాధికారి చైతన్యకృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాల వలన డెంగీ వ్యాధి బారిన పడి మరణించే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. ఆస్పత్రి వద్ద నుంచి కందుకూరు రోడ్డు జంక్షన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ వంశీధర్, డాక్టర లీనా, డాక్టర్ ఉజ్వల, సీహెచ్‌ఓ సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఆస్పత్రి నుంచి కొత్త బస్టాండ్ సెంటర్, పాత బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డెంగీ ఎలా సోకుతుంది, దోమ కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుధ్య నివారణపై డాక్టర్ ప్రతాప్ రెడ్డి అవగాహన కల్పించారు. డాక్టర్ సందీప్, సీహెచ్‌ఓం కేవీ చెన్నయ్య, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, సర్పంచ్‌లు గాలం రామక్రిష్ణ, కత్తిరాజారావు,కలుకూరి దేవకరణయ్య, అంగన్ వాడీ సూపర్‌జర్ పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్లర్లు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి


పనులను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి

గుడ్లూరు: ఉద్యానవన పంటలు పండిస్తున్న రైతుల ప్రయోజనాలు కోసం నిర్మిస్తున్న కలెక్షన్ పాయింట్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి సుబ్బారెడ్డి ఆదేశించారు. మండల కేంద్రమైన గుడ్లూరులో కొత్తపేటకు వెళ్లే రహదారిలో రైతు ఉత్పత్తి సంఘం(ఎఫ్‌పీఓ) ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కలెక్షన్ పాయింట్ నిర్మాణ పనులను సుబ్బారెడ్డి మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనులు ఎంత వరకు వచ్చాయో ఎఫ్‌పీఓ డైరక్టర్లు, కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉద్యానవన పంటలను సాగు చేసుకుంటున్న రైతులు తాము పండించిన పంటలను ఈ కలెక్షన్ పాయింట్ దగ్గరకు తీసుకొని వచ్చి గ్రేడింగ్ చేసుకొని క్వాలిటీని బట్టి లాభసాటి ధరలకు అమ్ముకోవచ్చన్నారు. దీనిని వారు గోడౌన్‌గా కూడా ఉపయోగించుకోవచ్చన్నారు. మామిడి కాయలు, కూరగాయలు, మిరపకాయలను రైతులు ఇక్కడకు తెచ్చుకొని గ్రేడ్ చేసుకోవచ్చన్నారు. రైతులకు ప్రయోజనం కలిగించేలా ప్రభుత్వం కలెక్షన్ పాయింట్ నిర్మిస్తుందన్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి కలెక్షన్ పాయింట్‌ను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. సుబ్బారెడ్డి వెంట కందుకూరు ఉద్యానవన శాఖ అధికారి బ్రహ్మసాయి, డైరక్టర్లు ఉన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి


రిజిష్టర్లు పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి సుబ్బారెడ్డి

గుడ్లూరు: సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి సుబ్బారెడ్డి అన్నారు. గుడ్లూరులోని సచివాలయం–2ను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల రికార్డులు, రిజిష్టర్లు, బయోమెట్రిక్ హాజరును, ప్రభుత్వ సేవా సర్వీస్ రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసిందన్నారు. సచివాలయాలకు పనులపై వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తే ప్రజల సమస్యలు తెలుస్తాయన్నారు. హెచ్‌ఓ బ్రహ్మసాయి,పంచాయితీ కార్యదర్శి అనూషాలు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పొన్నలూరు: మండలంలోని కె. అగ్రహారం బస్టాండ్ సెంటర్‌లో చెరువుకొమ్ముపాలెం యూత్ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజల సౌకర్యార్థం మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. వేసవికాలం ముగిసే వరకు చలివేంద్రం ఉంటుందని ప్రతి రోజూ ప్రజలకు మినరల్ వాటర్ అందజేస్తామన్నారు. జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తరుపతిరెడ్డి, సర్పంచ్ ఎస్‌కే చిన్నమస్తాన్, కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, పిల్లి కృష్టారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ప్రభ, మహా అన్నదానం


వివరాలు వెల్లడిస్తున్న జెడ్పీటీసీ, నాయకులు హుసేన్‌రెడ్డి,

పామూరు: గంగాభవానీ తిరునాళ్ల సందర్భంగా మండలంలోని మోపాడు గంగమ్మతల్లి దేవస్థానం వద్ద బుధవారం ఉదయం జలదిస్నానం, ముద్దాల పాలు రాయబారం, గావు, రాత్రికి మహాఅన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా విద్యుత్ ప్రభ ఏర్పాటు తోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గురువారం మధ్యాహ్నం రాష్ట్రస్థాయి ఎడ్లపందేలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, చప్పిడి అజయ్, రేగులగడ్డ నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా గంగాభవానీ గ్రామోత్సవం


ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహమూర్తులు


గంగాభవానీ ఉత్సవమూర్తికి గ్రామోత్సవం

పామూరు: మండలంలోని మోపాడు గంగాభవానీ తిరునాళ్లలో భాగంగా 3వ రోజు మంగళవారం గంగా మాత గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఈసందర్భంగా మోపాడు గంగానగర్, లక్ష్మీ నరసాపురం, ఇనిమెర్ల గ్రామాల్లో గంగాభవానీ ఉత్సవ విగ్రహమూర్తిని, బొల్లావులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై ఉంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ బాణసంచా కాలుస్తూ ఉత్సవం నిర్వహించారు.

వరిగడ్డి వాములు దగ్ధం

పామూరు: వరిగడ్డివాములు దగ్ధమై రూ.70 వేల ఆస్తినష్టం వాటిల్లింది. ఈ ఘటన మండలంలోని రేగుచట్లపల్లెలో మంగళవారం జరిగింది. గ్రామస్తుల సమాచారం మేరకు.. ఇల్లూరి పెదవెంగయ్య, రవిరెడ్డి, కొండయ్యలకు చెందిన వాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. గుర్తించిన గ్రామస్తులు మంటలను గ్రామం వైపునకు పాకకుండా అదుపు చేస్తూ కనిగిరి ఫైర్‌సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పివేశారు.

పెండింగ్ ఫైళ్లన్నీ వెంటనే పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగార్జునరెడ్డి

సీఎస్‌పురం(పీసీపల్లి): పెండింగ్‌లో ఉన్న ఫైళ్లన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని తహసీల్దార్ సీహెచ్ నాగార్జునరెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం కింద నిర్వహిస్తున్న భూ రీ సర్వే ఎంత వరకు వచ్చింది, ప్రస్తుతం ఏఏ గ్రామాలలో రీ సర్వే నిర్వహిస్తున్నారు తదితర అంశాలపై చర్చించారు. రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఇటీవల కాలంలో వచ్చిన మ్యుటేషన్ ఫైళ్ల గురించి వివరాలు సేకరించారు. గడువు తీరిన మ్యుటేషన్‌లను వెంటనే క్లియర్ చేయాలని చెప్పారు. ఆర్ఐ మల్లికార్జునరావు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వం

కొండపి: మండలంలోని పెట్లూరులో బుధవారం గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. వైఎస్సార్ సీపీ కొండపి నియోజక ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు హాజరవుతారన్నారు.

హుండీ ఆదాయం రూ. 3.69 లక్షలు

సింగరాయకొండ: పాత సింగరాయకొండ శ్రీ వరాహలక్ష్మీనరశింహ స్వామి దేవస్థానంలో మంగళవారం నిర్వహించిన హుండీ లెక్కింపులో 3,69,790 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. కృష్ణవేణి తెలిపారు. ఈ సంవత్సరం జనవరి 7 నుంచి మే 16 మధ్య కాలానికి సంబంధించి హుండీ లెక్కింపు జరిపినట్లు వివరించారు. దేవాదాయ ఇన్‌స్పెక్టర్ సత్యన్నారాయణ, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి


లేఅవుట్‌ని పరిశీలిస్తున్న లక్ష్మీరెడ్డి

పొన్నలూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి కె. లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జగనన్న కాలనీ లేఅవుట్‌ని మంగళవారం సందర్శించి అధికారులు, లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు కరెంట్, నీటి వసతులను ఏర్పాటు చేశారని, స్థలం పొందిన లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే పట్టా రద్దుచేసి ఆ స్థలాన్ని మరొకరికి కేటాయించడం జరుగుతుందన్నారు. హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఈఓఆర్డీ నాగేశ్వరరావు, కార్యదర్శి హరినారాయణ పాల్గొన్నారు.

డెంగీ నివారణకు కృషి చేయాలి


ర్యాలీలో పాల్గొన్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: డెంగీ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా కనిగిరి మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మలేరియా యూనిట్ అధికారి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ డెంగీ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఇళ్లముందు మురుగు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాల, వ్యక్తి గత పరిశుభ్రతను పాటించాలన్నారు. పగటి పూట కుట్టే దోమలతోనే డెంగీ వ్యాధి వస్తోందని తెలిపారు. ఆస్పత్రి సూపరిండెంట్ సయ్యద్ అబ్దుల్ కలాం మాట్లాడుతూ ఇంటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ప్రియార్షనంద, పార్థు, సూపర్ వైజర్ బాలుడు, వివిధ సంస్థల సభ్యులు కిరణ్‌కుమార్, రమేష్ బాబు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో సూపరింటెండెంట్ డాక్టర్ అబ్దుల్ కలాం అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ గఫార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు స్థల పరిశీలన

దీర్ఘకాలిక విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 1వ వార్డులో చైర్మన్ గఫార్, మున్సిపల్ కౌన్సిలర్ రామనబోయిన ప్రశాంతి శ్రీను, ఏఈ పవన్‌కుమార్‌లు పర్యటించారు. ప్రజల విన్నపం మేరకు నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫారం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. తక్షణ ప్రక్రియ ప్రారంభానికి ఏఈకి ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో రామనబోయిన శ్రీను, టెలికాం అడ్వయిజరీ కమిటీ మెంబర్ ఎస్‌కే జానీ, షాహిద్, వార్డు నాయకులు పాల్గొన్నారు.

75 లక్షలతో డ్రైనేజీల నిర్మాణం


భూమి పూజ చేస్తున్న సర్పంచ్ వనజ

సింగరాయకొండ: మండల కేంద్రంలోని నాలుగు గ్రామ సచివాలయాల పరిధిలో సుమారు 75 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 13 మురుగు కాల్వలు నిర్మించనున్నట్లు సర్పంచ్ తాటిపర్తి వనజ తెలిపారు. స్థానిక బాలయోగినగర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మురుగుకాల్వల నిర్మాణానికి భూమిపూజ చేశారు. సర్పంచ్ వనజ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మించి డ్రైనేజీలు మరవడంతో వాటి నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నిర్మించనున్నట్లు ఆమె వివరించారు.

పొగాకు కనిష్ట ధర రూ. 168

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో గురువారం జరిగిన వేలంలో పొగాకు కనిష్ట ధర రూ. 168 వ్యాపారులు కొనుగోలు చేశారు. తూర్పునాయుడు పాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాలకి చేందిన రైతులు 1075 బేళ్ళను వేలాని తీసుకురాగా వాటిలో 1053 కొనుగోలు జరిగగా, 22 పొగాకు బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 200 కాగా, కనిష్ట ధర రూ. 168 పలకగా, సరాసరి రూ. 199. 51 ధర పలికింది.